వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరు కాగా స్థానిక కౌన్సిలర్ బండి భాగ్యలక్ష్మీ శ్రీకాంత్‌యాదవ్ దంపతులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పీ సంజయ్‌యాదవ్ తదితరులు ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మాజీ సర్పంచ్ గణేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నీరటి తన్వీరాజు, కాంగ్రెస్ నాయకులు డీ వెంకటేశ్‌గౌడ్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జిల్లపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతాళ్లకుంట పార్కులో వసతులు కల్పించాలి


ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని పెద్దతాళ్లకుంట పార్కులో వసతులు కల్పించాలని పెద్దతాళ్లకుంట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్కులో ప్రజల సౌకర్యార్థం యోగా సెంటర్, విద్యుత్ దీపాలు, సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలన్నారు. పార్కుకు ఫెన్సింగ్, తాగునీటి సౌకర్యం, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, బర్ల జంగయ్య, దుర్గాదాస్, కే హరినాథ్, ఎలుక శ్రీనివాస్ రెడ్డి, కే శేఖర్ రెడ్డి, సహదేవ రెడ్డి, పొట్ట అనిల్ కుమార్, వీ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనమొల్ల సంజీవకు సేవాభారతి అవార్డు



అవార్డును అందుకుంటున్న కొనమొల్ల సంజీవ

శంషాబాద్: పట్టణంలోని ఆర్‌బీనగర్ కాలనీకి చెందిన కొనమొల్ల సంజీవకు సేవాభారతి–2024 అవార్డు వరించింది. హెవెన్ హోమ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతీలో జరిగిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, కేంద్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ అనురాధ, న్యాయమూర్తి నేరెళ్ల మల్యాద్రిరెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సంజీవ మాట్లాడుతూ జిల్లా న్యాయసేవా సాధికారత అథారిటీ, మహిళా శిశు సంక్షేమ, రక్షణ, సాధికారత రంగాల్లో చేసిన సేవలను గాను అవార్డును అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా హెవెన్ హోం సొసైటీ జీ వరలక్ష్మి తదితరులు ఆయన్ను అభినందించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


పీరం చెరువులో చెత్త తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బీ శరత్‌చంద్ర అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీరం చెరువులో చెత్త తొలగింపు, రెండో డివిజన్ బతుకమ్మ కుంట, హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో నాయకుడు పాండు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు ఏ.శ్రీహరిరావు


హాజరైన సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 1104 యూనియన్ కృషి చేస్తున్నదని రాజేంద్రనగర్ డివిజన్ యూనియన్ అధ్యక్షుడు ఏ. శ్రీహరిరావు అన్నారు. యూనియన్ పదవి కాలం ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గగన్‌పహాడ్ సబ్ స్టేషన్‌లో ప్రస్తుత కార్యవర్గ సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో ఉద్యోగుల వేతనాలు, ప్రమోషన్లు, బదిలీల్లో న్యాయం జరిగేలా పని చేశామన్నారు. త్వరలోనే నూతన కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలను నిరంతరం పరిష్కరించేందుకు పని చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డివిజన్ విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం కార్యదర్శి అజీమ్, అడిషనల్ డివిజన్ ప్రెసిడెంట్ డీ శ్రీనివాస్, అడిషనల్ సెక్రటరీ రమణ, రాష్ట్ర యూనియన్ నాయకులు బాబురావు, నరేందర్, మల్లేశం, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఆర్‌పై అదుపుతప్పిన లారీ



రాజేంద్రనగర్: ఓఆర్‌ఆర్‌పై లారీ అదుపుతప్పి సర్వీసు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. (ఏపీ 13ఎక్స్ 9782)నంబర్ వాహనం గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు భారీ మిషనరీ విభాగాలతో వెళ్తున్నది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో హిమాయత్‌సాగర్ ఔటర్ వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వాహనం అదుపుతప్పి ఔటర్‌పై రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన భారీ కంచెలను ధ్వంసం చేసుకుంటూ సర్వీస్ రోడ్డుపైకి దాదాపు 100 మీటర్ల దూరం వరకు వెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను పోలీసులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఘటన కారణంగా ఓఆర్‌ఆర్‌పై ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించారు. ఈ విషయమై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 'బాలోత్సవ్'

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం బాలోత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్లానటరీ సొసైటీ వ్యవస్థాపకుడు రఘునందన్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వివిధ వేషధారణలు, చిత్రలేఖనం, జానపద గేయాలు, నృత్యాలు, నాటికలు, పాటల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు గండిపేట ఎంఈఓ విజయ్‌కుమార్, చొక్కాపు వెంకటరమణ బహుమతులను అందించారు.


బాబుల్‌రెడ్డినగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ డీజీపీ గోపినాథ్‌రెడ్డి


హైదర్షాకోట్‌లో రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ జ్ఞానేశ్వర్..

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

నియోజకవర్గవ్యాప్తంగా అంబేడ్కర్ వర్ధంతి

భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఆయా కుల, యువజన సంఘాలతో పాటు వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగినప్పుడే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– రాజేంద్రనగర్, జోన్ బృందం


రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో..


వాంబేకాలనీలో ..


నార్సింగిలో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ తదితరులు


కోకాపేటలో టీపీసీసీ అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి తదితరులు


బండ్లగూడలో కార్పొరేటర్ సాగర్‌గౌడ్ తదితరులు


నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తదితరులు


రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో..

నేటి నుంచి రాష్ట్ర వ్యవసాయ కార్మికుల సంఘం సమావేశం

శంషాబాద్: పట్టణంలోని ఎలైట్ హోటల్‌లో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు జే జంగయ్య, కార్యదర్శి బద్దుల జంగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఇటీవల అకాల మరణం చెందిన సీపీఐ రాష్ట్ర నాయకుడు బాల మల్లేశ్ సంతాప సభను కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక



కొండకళ్ల నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అత్తాపూర్‌కు చెందిన కొండకళ్ల నాగేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో 15 ఏళ్లుగా క్రమశిక్షణ గల కార్యకర్తగా పని చేస్తున్నానన్నారు. సీనియర్, యువజన కాంగ్రెస్ నాయకులను కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.

రేపు అయ్యప్ప మహాపడి పూజ

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రామం ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ శివాంజనేయ దేవస్థానం వద్ద ఈ నెల 8న బుద్వేల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కేరళ తాంత్రిక శ్రీ శివనర్సింహా తంత్రి ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

బాధ్యతల స్వీకరణ


డాక్టర్ దుర్గాలత

శంషాబాద్: శంషాబాద్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ దుర్గాలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రోగులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

డిమాండ్ల సాధనకు 10 నుంచి నిరవధిక సమ్మె


ఎంపీడీఓకు వినతిప్రతం ఇస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

శంషాబాద్ రూరల్: తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు యూనియన్ నాయకుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. నిరసనల్లో భాగంగా ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓకు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్‌లో 721 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 20 ఏళ్లుగా చాలీచాలనీ జీతాలతో పని చేస్తున్నారన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ అయ్యేందుకు పూర్తి అర్హతలు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో టీపీసీసీ హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి


జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: భవానీకాలనీకి సక్రమంగా నీటి సరఫరా చేయాలని కోరుతూ భవానీకాలనీ ఆల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఈ మేరకు జలమండలి అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా నీటి సరఫరా కావడం లేదని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని కోరామన్నారు. ఆయన వెంట కాలనీవాసులు గోల్కొండ యాదయ్య, రూపే శుక్లా, మోహన్, సూర్యనారాయణ, వెంకట్రావు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్‌పై ఐక్యంగా పోరాడాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూ ఎస్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర యాంటీ నార్కొటిక్ బ్యూరో రూపొందించిన పోస్టర్లను వీసీ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో డ్రగ్స్ సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. ఇటీవల సమాజంలో డ్రగ్స్ వాడకం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సామాజిక దురాగతాలకు దారితీస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ డ్రగ్స్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌సీయూ ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్ సెల్ త్వరలో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కొటిక్ బ్యూరో సహకారంతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. హెచ్‌సీయూ అధికారులు, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐఎంసీ సేవలు భేష్

మనూ వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: ఉర్దూ భాష ద్వారా ప్రజలను జ్ఞానానికి అనుసంధానించడంలో ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) సేవలు భేష్ అని 'మనూ' వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభివర్ణించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలోని ఐఎంసీ సెంటర్ నిర్వహించే యూట్యూబ్ చానల్ సబ్‌స్క్రైబర్లు లక్ష దాటిన సందర్భంగా శుక్రవారం ఆయన ఐఎంసీ సెంటర్ ప్రతినిధులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 80 లక్షల మంది వీక్షకులను కలిగి ఉండడం అభినందనీయమన్నారు. లక్ష మంది సబ్ స్క్రైబర్స్ మైలురాయి దాటడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఐఎంసీ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మణికొండ: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 7న (నేడు) పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్ శంకుస్థాపన చేయనున్నట్లు కమిషనర్ టీ కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నార్సింగిలో మహిళా శక్తి క్యాంటీన్, తొమ్మిదో వార్డులో పార్కు, 10, 15 వార్డులు మంచిరేవులలో సీసీ రోడ్లు, బతుకమ్మ ఘాట్, మోడ్రన్ లైటింగ్, కల్వర్టు, నార్సింగిలోని ఆరో వార్డులో సర్కిల్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం..

మణికొండ: సెక్రటేరియట్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిటీహాల్‌లో ఈనెల 7న (నేడు) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మణికొండ మున్సిపల్ చైర్మన్ కే నరేందర్‌ముదిరాజ్ శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ రావుస్ ఈఎన్‌టీ, శ్రీరాం ఆర్థో, అక్షయ డెంటల్, మెడికవర్ ఆసుపత్రుల వైద్యులు పాల్గొని అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు


ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు డీ సీతారాం ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్సీ కవితను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని అందుకు తామంతా అండగా ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్‌ను అణచివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి జైలుకు పంపుతోందని వాటిని ఎదుర్కొని నిలబడి పోరాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే ధన్‌రాజ్, నాయకులు లతాగౌడ్, మాల్యాద్రినాయుడు, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, ఆరీఫ్, కిరణ్, మంజుల, సుజాత, రేఖ, భాను, మంజు తదితరులు ఉన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి


రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సురేశ్‌గౌడ్

బండ్లగూడ: సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని కార్పొరేటర్ గోకరి సురేశ్‌గౌడ్ పేర్కొన్నారు. 18వ డివిజన్ ధాత్రీ కాలనీలో రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అభివృద్ధి పనులకు ప్రజలు సైతం సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'కాంగ్రెస్‌ది నిరంకుశ పాలన'


మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజ్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

బండ్లగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ నిరంకుశ పాలన సాగిస్తున్నదని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుకోళ్ల నాగరాజ్ అన్నారు. పోలీసులు ఆయనను శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్ష పార్టీ మాజీ మంత్రి, ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. సమస్యలపై పోరాడే వారిని ప్రశ్నించే గొంతును నిర్బంధించడం ఆ పార్టీకి అలవాటుగా మారిందన్నారు.

బీఆర్ఎస్ నాయకుల హౌస్ అరెస్ట్


బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డితో పాటు ఇతర నాయకులను పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు కే గౌతం, సీనియర్ నాయకులు ప్రొ రవీందర్, నరేందర్, ఎర్రబోడ విలేజ్ అధ్యక్షుడు గిరిబాబు, చిరంజీవి, శివ, చిన్న, నవీన్ తదితరులు పాల్గొనానరు.

జీఎంఆర్ హైదరాబాద్ కార్గోకు సీటీపీఏటీ సర్టిఫికెట్


సీటీపీఏటీ సర్టిఫికెట్‌తో ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్

శంషాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ కార్గో ప్రతిష్ఠాత్మకమైన సీటీపీఏటీ (కస్టమ్స్ ట్రేడ్ పార్టనర్‌షిప్ అగైనెస్ట్ టెర్రరిజం) సర్టిఫికెట్ పొందినట్లు సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. యూఎస్ కస్టమ్స్ బార్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) నేతృత్వంలో సీటీపీఏటీ నిర్వహిస్తున్నారు. ఉగ్రవాదుల బెదిరింపుల నుంచి సప్లై చైన్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా ఉన్నత ప్రమాణాలతో భద్రత చర్యలు చేపట్టడంతో సర్టిఫికెట్ వచ్చిందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ తెలిపారు.